క్లుప్తంగా

'నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా ఉంటా'



రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న గజేందర్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఇటీవల మండలంలోని గుత్పాల గ్రామంలో పర్యటించి కిడ్నీ బాధితులకు తన సొంత ఖర్చులతో మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం ఆడే గజేందర్ బృందం సభ్యులు ప్రైవేట్ వాహనంలో కిడ్నీ బాధితులను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్‌లను కోరారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు సాజిదొద్దీన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి జోగు రామన్న వేలకోట్ల రూపాయలతో ఆదిలాబాద్ అభివృద్ధిని చేసి చూపించారని అన్నారు. 200 యూనిట్ల కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధుల పింఛన్లు, రేషన్ కార్డులపై దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర పోతుందన్నారు. ఆదిలాబాద్ కమాన్‌కు కట్టిన కాంగ్రెస్ ఫ్లెక్సీలను అధికారులు తొలగించకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చందాల రాజన్న, దమ్మపాల్, తన్వీర్, బుట్టి శివ, సంతోష్, అయ్యుబ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఎంవీఐలు అల్లే శ్రీనివాస్, విద్యాధర్ రెడ్డిలు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం భోరజ్ అంతరాష్ట్ర రోడ్డు రవాణా చెక్‌పోస్ట్ వద్ద వాహనాదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వవిద్యార్థులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) గ్రామానికి చెందిన శివాంగి అనే బాలిక గత కొన్ని రోజుల నుంచి తలసేమియాతో బాధపడుతోంది. కాగా.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2007–08వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం బాధిత కుటుంబానికి రూ. 21 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శివ, మురళి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఐటీడీఏ ఎదుట చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పూసం ఈశ్రు అన్నారు. గురువారం మండలంలోని భవానిగుడాలో ఆదివాసీ గిరిజనులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఏజెన్సీలో ఐదో షెడ్యూల్ ప్రకారం 1/70, ఎల్‌టీఆర్, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా అధికారులు తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. ఆదివాసీలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ల నిర్మాణానికి అనుమతులేవీ?

- శిలాఫలకానికే పరిమితమైన రోడ్డు
- అటవీశాఖ నుంచి రాని అనుమతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



2018లో వేసిన శిలాఫలకం



రాంపూర్, మొట్లగూడ రోడ్డు

దహెగాం: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద కోట్ల రుపాయలను విడుదల చేస్తున్నా.. రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు రాకా పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని కర్జి నుంచి రాంపూర్ మీదుగా మొట్లగూడ వరకు సుమారు 12 కిలో మీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2018లో పీఎంజీఎస్‌వై కింద 6.25 కోట్లు మంజూరు చేసింది. కర్జి నుంచి రాంపూర్ వరకు అడవీ ఉండడంతో అనుమతులు లేక పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

6.25 కోట్లు మంజూరు..

కర్జి నుంచి మొట్లగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి పీఎంజీఎస్‌వై కింద 6.25 కోట్లు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ కర్జి నుంచి రాంపూర్ వరకు అడవి ఉండడంతో అధికారులు అనుమతులు లేవని పనులను నిలిపి వేశారు. అప్పటి నుంచి ఆరు సంవత్సరాలు అవుతున్నా.. రోడ్డుకు గ్రహణం పట్టుకుంది. దీంతో మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి, దిగిడ, టేపర్‌గాం, శంకరాపురం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డంతా బురద..

వర్షాకాలం వచ్చిందంటే చాలు కర్జి నుంచి మొట్లగూడ వరకు ఉన్న మట్టి రోడ్డంతా బురదగా మారుతుంది. దీంతో ప్రజలు అవసరాల నిమిత్తం దహెగాం మండల కేంద్రానికి రావాలంటే వారి బాధలు అన్ని ఇన్ని కావు. అత్యవసర వేళల్లో సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం చలికాలం, వేసవిలో మంచిర్యాల డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు సేవలు ఉంటాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు బస్సు సేవలను అధికారులు నిలిపివేస్తారు. దీంతో ప్రజలు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డంతా బురదగా మారడం, కర్జి ప్లాంటేషన్ వద్ద వర్షాలకు రోడ్డు కోతకు గురవుతుంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

మండలంలో అనేక గ్రామాలకు సరైన రోడ్లు లేవు. ఉన్న రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలు పడ్డ చోట మరమ్మతులు చేయించే నాథుడే కరువయ్యాడు. ఇన్ని సమస్యలు ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కేంద్రంలో బీజేపి సర్కారు ఉంది. కేంద్ర మంత్రులతో మాట్లాడి అటవీ అనుమతులు తీసుకురాలేక పోతున్నారు అంటు పలువురు ప్రజాప్రతినిధులపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే



బహుమతి అందజేస్తున్న అధికారులు

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి: క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో పోతురాజు, ధర్మరాజు ఆలయ సమీపంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. పురాతన కాలం నుంచి వస్తున్న కబడ్డీ ఆటలపై మక్కువ చూపడం సంతోషమన్నారు. కార్యక్రమంలో ఏపీవో (పీవీటీజీ) మెస్రం మనోహర్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, మాజీ జెడ్పీటీసీ దుర్పతబాయి, సిడాం రాజు, సిడాం ధర్ము, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా వేమనపల్లి మండలంలోని మల్లంపల్లి జట్టు, రన్నరప్‌గా చేడ్వాయి జట్టు నిలిచింది. విజేత జట్టుకు మాజీ సర్పంచ్ చౌదరి సుజాత శ్రీనివాస్ రూ.15వేలు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, ఎస్సై కొమురయ్య, ఆర్ఐ సురేశ్, శ్రీనివాస్, బాబు, సత్తయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ భాగవతం



ప్రవచనం చేస్తున్న ప్రవచకులు బుర్రాభాస్కర శర్మ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో గురువారం దేవీభాగవత జ్ఞానయజ్ఞ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. స్థానిక ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవచకులు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర శర్మ ప్రవచనం ఆద్యంతం ఆకట్టుకుంది. వారం రోజుల పాటు ఈనెల 24 వరకు ఉదయం, సాయంత్రం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇందారపు మధూకర శర్మ ప్రవచకులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



సప్తాహానికి హాజరైన భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని శ్రీశ్రీ భాస్కరశర్మ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయం ఆవరణలో శ్రీమద్దేవి భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని ఆయన ప్రారంభించారు. మొదట భాగవత సప్తాహ గ్రంథంలో భక్తులతో కలిసి వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి భాజాభజంత్రీతతో,మంగళహారతులతో శోభాయాత్రగా సాయిబాబా ఆలయం వరకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఇందారపు మధుకర్‌శర్మ, గట్టు సాయిశర్మలు శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. మధుకర్ శర్మ భక్తులకు ప్రవచనాలను బోధించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇంటింటా సర్వే పరిశీలన



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పథకాల క్షేత్రస్థాయి పరిశీలన గురువారం మండలంలో ప్రారంభమైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతున్నందున హత్తిని, పీపీరావు కాలనీ, లగ్గాం, చౌక గ్రామాల్లో ఎంపీడీవో రాజేందర్, డీటీ లలితలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భాగంగా ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉండి 20 రోజులు 2023–24 సంవత్సరంలో పనికి వెళ్లిన వారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులన్నారు. రైతు భరోసా కింద సాగుకు యోగ్యమైన వాటికే అందుతుందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేందర్

కెరమెరి: ప్రభుత్వం చేపట్టనున్న పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రారంభమైన సర్వేను కెరమెరి, అనార్‌పల్లి గ్రామాల్లో గురువారం తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషాలు పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. ప్రభుత్వం రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ, ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సర్వే సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా సర్వే చేపట్టాలన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన: ఐక్య ఉద్యమాల ద్వారానే సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. గురువారం గోలేటి సీహెచ్‌పీలో కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు, డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్టు కార్మికుల పక్షాన పని చేస్తున్న కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలన్నారు. బెల్ట్ క్లీనింగ్, డ్రైవర్లు, బ్లాస్టింగ్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు అందడం లేదన్నారు. ఇప్పటికీ రెండుసార్లు స్ట్రక్చర్ కమిటీ సమావేశాలు జరిగినప్పటికీ గుర్తింపు సంఘం గానీ, ప్రాతినిధ్య సంఘం గానీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నోరు మెదపకపోవటం విచారకరమన్నారు. నర్సరీ కార్మికులకు కనీసం అగ్రికల్చర్ జీవో కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. సంస్థలో ప్రతీ విభాగంలో కాంట్రాక్టు కార్మికులు చాలీచాలనీ వేతనాలకే పని చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రతినెల 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఏనాడు సక్రమంగా చెల్లించలేదన్నారు. సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు గోపాల్, రాజేశం, రాజన్న, వెంకటేశ్, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

జోరుగా యాసంగి సాగు

- కూలీలు దొరక్క ఇబ్బందులు
- వరినాట్లకు పొరుగు రాష్ట్రాల కూలీలు
- 6 వేల ఎకరాల్లో వరి సాగు



నారు సిద్ధం చేస్తున్న కూలీలు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలో యాసంగి వరినాటు పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని బొక్కివాగు ప్రాజెక్టు, చెరువులు, కుంటలతో పాటు బోరు బావుల కింద రైతులు యాసంగి సాగు పనులను ముమ్మరంగా చేస్తున్నారు. వరినాట్లకు స్థానికంగా కూలీలు దొరక్క పోవడంతో పశ్చిమబెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్రల నుంచి వచ్చిన కూలీలతో రైతులు నాట్లను వేయిస్తున్నారు.

6 వేల ఎకరాల్లో సాగు..

మండలంలోని కొండపల్లి, లోడుపల్లి, ఎల్లూర్, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, గొంట్లపేట్, బొంబాయిగూడ, మొట్లగూడ, చేడ్వాయి, పోతెపల్లి, దరోగపల్లి గ్రామాల్లో సుమారు 6వేల ఎకరాల్లో రైతులు యాసంగి పంటగా వరి సాగు చేస్తున్నారు. యాసంగి పనులు ఏకకాలంలో ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన కూలీలు తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతో రైతులు ఇతర రాష్ట్రాల కూలీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరానికి సుమారు రూ.4500 నుంచి రూ. 5వేల రూపాయలను చెల్లించి వరినాట్లు వేస్తున్నారు. పన్నెండు మంది గ్రూపు కలిగిన కూలీలు రోజుకి సుమారు 5ఎకరాల్లో వరినాట్లను వేస్తున్నారు.

వరినాట్లతో ఉపాధి



పది రోజుల క్రితం వారినాట్లను వేయటానికి వచ్చాము. 12 మంది కలిసి గ్రూపుగా ఏర్పడ్డాం. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 5 ఎకరాల పొలంలో వరినాట్లు వేస్తాము. ప్రతీ ఏటా వరినాట్లతో ఉపాధి పొందుతున్నాము.

– తపాస్ మండల్, కూలీ

సీజన్ పూర్తయ్యే వరకు..



నెల రోజుల క్రితం వరినాట్ల కోసం కరీంనగర్ జిల్లాకు వచ్చాము. అక్కడ వరినాట్లు పూర్తి కావడంతో ఉపాధి కోసం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి, పెంచికల్‌పేట్, ఎల్లూర్ గ్రామాల్లో వలస ఏర్పాటు చేసుకున్నాం. సీజన్ పూర్తయ్యే వరకు ఇక్కడే పనులు చేస్తాం. ఖర్చులు పోను ప్రతీ రోజు సుమారు 12 నుంచి 15 వందల రూపాయాలు సంపాధిస్తున్నాం.

– అరుణ్, కూలీ, పశ్చిమ బెంగాల్.

సన్మానం

లింగాపూర్: మండల కేంద్రంలోని గురువారం హనుమాన్ మందిరానికి నూతన షెడ్, తాగునీటి ట్యాంక్‌ల నిర్మాణానికి రూ. 40 వేలు విరాళం అందజేసిన రేహమాన్ ఫౌండేషన్ చైర్మ న్ అబ్దుల్ రేహమాన్‌ను లింగాపూర్ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాదవ్ గణపతి, రాథోడ్ కిరణ్ నాయక్, దవీత్, విరస్, ఆడే లక్కా, రామ్ పాల్గొన్నారు.

బీజేపి మండల అధ్యక్షుడిగా రమేశ్



రమేశ్

తిర్యాణి: బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలో ని రాళ్ల కన్నెపెల్లి గ్రా మానికి చెందిన సార ర మేశ్ గౌడ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా ఎన్నికల అధికారి ధోని శ్రీశైలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికై నా రమేశ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీజేపీ పార్టీని మ రింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

కాగజ్‌నగర్ రూరల్: కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం మండలంలోని భట్‌పల్లి, కోసిని గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి ఏమైనా దరఖాస్తులు వస్తే స్వీకరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డు కోసం సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమేశ్, వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, ఏపీవో బుచ్చన్న, ఏఈవో సృజన, పంచాయతీ కార్యదర్శి మహేశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భట్‌పల్లి గ్రామపంచాయతీలో సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ విభాగానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. చాలా మంది విద్యార్థులు, యువతీ, యువకులు తమకంటూ ఒక ప్రత్యేకమైన లక్ష్యం లేకుండా సమాజంలో పెడదారిపడుతున్నారన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాల వైపు పయనించాలంటే నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఆదిలాబాద్ అధ్యక్షుడు గూడెం వినోద్, కుమార్, మధుకర్, వర్కింగ్ ప్రసిడెంట్ సాయికృష్ణ, విజయభాస్కర్, మధుకర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరిన జగద్గురు పాదుకలు



పాదుకల దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఆసిఫాబాద్: మహారాష్ట్రకు చెందిన జగద్గురు నరేంద్రాచార్య రత్నగిరి మహరాజ్ చరణ పాదుకలు గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన తాటిపెల్లి దిలీప్ నివాసంకు పలువురు భక్తులు పాదుకల దర్శనం చేసుకున్నారు. స్థానిక ప్రేమల గార్డెన్ పక్కన శుక్రవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. సనాతన ధర్మంపై నిర్వహించే ప్రచారంలో భాగంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.